రైతులకు చైతన్యమేదీ?

- అటకెక్కిన 'మన తెలంగాణ – మన వ్యవసాయం'
- పంటల సాగుపై అవగాహన కల్పించని యంత్రాంగం
- నష్టపోతున్న రైతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంలో వ్యవసాయ శాఖ వైఫల్యం కనిపిస్తోంది. మూడేళ్ల కిందట వరకు సీజన్ ప్రారంభానికి ముందు మే నెలలో వారం రోజుల పాటు మన తెలంగాణ – మన వ్యవసాయం పేరుతో చైతన్య యాత్రలు నిర్వహించేది. దీంతో రైతులు ఏ విత్తనాల ఎంపిక, నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు, ఏఏ పంటలను సాగు చేయాలి అనే వాటిపై అవగాహన కల్పించే వారు. ప్రతీ గ్రామంలో ఈ రైతు చైతన్య యాత్రలు జరగడం వల్లన కింది స్థాయి రైతులకు అవగాహన వచ్చేది. అలాగే అధికారులకు, రైతులకు మధ్య మంచి సంబంధాలు ఉండేవి. కానీ ఇప్పుడు రైతు చైతన్య యాత్రలు నిలిచిపోవడంతో అన్నదాతలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.


అచ్చుతీస్తున్న రైతు (ఫైల్)

పంట సాగులో రైతులకు ఇబ్బందులు

ప్రతి ఏటా వర్షాకాలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు చైతన్య యాత్రలు, రైతు సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉండగా కొన్నేళ్లుగా వీటిపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఏ పంట వేయాలో, ఏ పంట వేయద్దో తెలియని రైతులంతా మూస పద్ధతిలో పత్తి, వరి పంటపై దృష్టి సారిస్తున్నారు. ఈ సాగు విధానంలో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తెగుళ బెడదతో పంటను కాపాడుకునేందుకు ఖరీదైన మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి పెరిగి ఆర్థికంగా దెబ్బతింటున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ప్రతి ఏటా రైతు చైతన్య యాత్రలు, మన తెలంగాణ – మన వ్యవసాయం కార్యక్రమాలను నిర్వహించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మెళకువలు నేర్పాలి



పంటల సాగులో అధికారులు మెళకువలు నేర్పాలి. గతంలో నిర్వహించిన మాదిరిగానే 'మన తెలంగాణ – మన వ్యవసాయం' పై సదస్సుల ద్వారా రైతులను చైతన్యపరచాలి. పంటల్లో చీడ పీడలు, తెగుళ్ల సోకి నష్టపోతున్నాం. వాటి నివారణ, పంటల సాగుపై గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలి.

– పెద్దబోయిన సైదులు, రైతు, యల్లాపురం

అవగాహన కల్పించాలి



పంటను సాగు చేస్తున్న సమయంలో పంట మార్పిడిలో ఏ పంటను సాగుచేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందో అవగాహన కల్పించాలి. విత్తనాల ఎంపికలో ఏవీ నకిలి విత్తనాలో ఏ విత్తనాలు స్వచ్ఛమైనవో తెలియక సతమతమవుతున్నాం. పంటలు వేసే క్రమంలో రైతు వేదికల్లో రైతులకు అవగాహన కల్పించాలి.

– బాణావత్ బీక్లా నాయక్ రైతు, గర్కనట్‌తండా

క్లుప్తంగా

రైతు బంధుకు దరఖాస్తులు చేసుకోవాలి

అడవిదేవులపల్లి : ఈనెల 16వ తేదిలోపు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని అర్చన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జీరాక్స్‌లతో సంబంధిత వ్యవసాయ శాఖ ఏఈఓలకు ఇవ్వకపోతే ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రైతు బంధు డబ్బులు ఖాతాలో జమ కావాన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్

హాలియా : విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) నాగార్జున సాగర్ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలు, ప్రైయివేట్ పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హాలియా శాఖ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యాజమన్యాలు విద్యా సంస్థల బంద్‌కు సహకరించాలని కోరారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతి



మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన బొందు పార్వతీ శనివారం రాత్రి నల్లగొండలో నిర్వహించిన సంఘం మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తానన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల వేతనాలను పెంచాలని, బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు మరింత బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించాలని, అద్దె బిల్లులు, కూరగాయల బిల్లును తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తన నియమకానికి అన్ని విధాలుగా సహరించిన ప్రతి అంగన్‌వాడీ టీచర్లకు, యూనియన్ నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సత్య సాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాపోలు గురూజీచే ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 99667 76365, 98485 57372 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: రూ.లక్షలోపు పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక కతాల్‌గూడెంలో ధర్నా కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంటరుణాలను మాఫీ చేయకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దండెంపల్లి సరోజ, మారగోని నగేష్, బచ్చగోని మల్లేష్, పనస చంద్రయ్య, దండెంపల్లి యాదయ్య, బొమ్మ నాగరాజు, మారయ్య, జెట్టి యాదయ్య, అంజమ్మ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్: మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన పర్సనబోయిన చైత్రయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు ఆదివారం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా బోయినపల్లి గ్రామానికి చెందిన పర్సనబోయిన వెంకన్న చేతికి ఇటీవల కూలర్ పంక తగిలి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రూ.5వేల సాయం అందించారు.

ఫార్మా నిర్మాణ పనులు నిలిపివేయాలి

మునుగోడు: ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేసే వరకు తమ ఉద్యమం కొనసాగిస్తామని ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు అన్నారు. మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 65వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు పోగుల సుధాకర్ రెడ్డి, మాధవరెడ్డి, నాగిరెడ్డి, నందిపాటి వెంకన్న, మల్లయ్య, ఏనుగుల రమేష్, బోయ చంద్రయ్య, నందిపాటి ముత్యం, అంజయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ ఏర్పాటుకు కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

డిండి : మండల కేంద్రంలో చేపల మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శ్రీశైల దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఆదివారం మార్గ మధ్యలోని డిండి ప్రాజెక్టు వద్ద కాసేపు ఆగారు. ప్రాజెక్టు వద్ద చేపలు విక్రయిస్తున్న మహిళలతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఆ పార్టీడిండి పట్టణ అధ్యక్షుడు గిరమోని శ్రీను, బల్మూల తిర్పతయ్య, బాసిద్, ఆయూబ్, బాలయ్య వ్యాపారులు సాయమ్మ, లింగమ్మ, అనసూయ, శంకరమ్మ, శాంతమ్మ ఉన్నారు.


శ్రీశైలం దేవస్థానం వద్ద కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే రవీంద్రకుమార్

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే

దేవరకొండ : శ్రీశైల మల్లిఖార్జున స్వామి దేవాలయాన్ని ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేకువజామున దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిపై మల్లన్న ఆశీస్సులు ఉండాలని కోరారు.

కొనసాగుతున్న ఏబీవీపీ దీక్ష

దేవరకొండ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్థలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని మున్సిపల్ అధికారులు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట చేపట్టిన దీక్ష ఆదివారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్ మాట్లాడుతూ దాతలు ఇచ్చిన స్థలాన్ని మార్కెట్ పేరుతో అధికారులు స్వాధీనం చేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎంతో మంది ఉన్నత స్థితికి కారణమైన కళాశాల ఆవరణలో మార్కెట్ ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు రూపొందించడం తగదన్నారు.ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉన్నతాధికారులు మార్కెట్ ఏర్పాటు పనులను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల రాకేష్, ఈశ్వర్, తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

బాధిత కుటుంబాలకు అండగా జైవీర్‌రెడ్డి

- రూ. 1,60,000ల విలువగల రేకులు అందజేత

హాలియా: వర్షానికి ఇళ్లు ధ్వంసమైన బాధిత కుటుంబాలకు రేకులు అందించి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువనాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి అండగా నిలిచారు. ఈనెల 20న ఈదురుగాలుల బీభత్సవానికి అనుముల మండలంలోని తిమ్మాపురం గ్రామంలో 45మంది కుటుంబాలకు చెందిన రేకుల ఇళ్ల పై కప్పులు ఎగిరిపోవడంతో పాటు కొందరి ఇంటి గోడలు కూలిపోవడంతో బాధిత కుటుంబాలు వీధిన పడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువనాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి తక్షణమే స్పందించి ఆదివారం గ్రామంలో ఇళ్లు నష్టపోయిన బాధిత కుటుంబాలకు రూ.1,60,000ల విలువగల రేకులు అనుముల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. దీంతో బాధిత కుటుంబాలు కుందూరు జైవీర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు కుందూరు రాజేందర్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్లు పిల్లి ఆంజనేయులు, తక్కెళ్ళపల్లి సైదులు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గుర్రం అమరేందర్‌రెడ్డి, వడ్డీ లింగారెడ్డి, బద్దిపాక విగ్నేష్ తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబాలకు రేకులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జర్నలిస్టు తులసీ చందుకు మద్దతు తెలపాలి

నిడమనూరు : ఆర్ఎస్ఎస్ నేతల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్వతంత్ర జర్నలిస్ట్ తులసి చందుకు మద్దతు తెలపాలని, ఆమెపై దాడిని ఖండించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లడుతూ తులసి చందును చంపుతామని ఫోన్‌లో ఆర్ఎస్ఎస్ సానుభూతి పరులు బెదిరిస్తున్నారన్నారు. స్వతంత్ర జర్నలిస్ట్‌గా దేశంలో మతోన్మాదం, మనువాద ఆగడాలు, అరాచకాలను ప్రశ్నిస్తూ శాంతి సామరస్యాలు వెల్లివిరియాలని ధృడ సంకల్పంతో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఆమెకు ఏం జరిగినా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. తులసీ చందుకు కేవీపీసీ మద్దతు ఉంటందని తెలిపారు. ఆయన వెంట నాయకులు ఇంజమూరి శివ, శేఖర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న విజసింహారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఎఫ్‌సీఐ ప్రాంగణంలో వెలసిన బంగారు మైసమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టిబాబు నాయక్, నాయకులు ఏడుకొండలు, సర్పంచ్‌లు బారెడ్డి అశోక్‌రెడ్డి, మాలోతు రవినాయక్, ఎఫ్‌సీఐ కార్మిక నాయకులు ధనావత్ శంకర్‌నాయక్, బిక్షానాయక్, బుజానాయక్, సోమానాయక్, లాలోజీ, పాండునాయక్, రవినాయక్, కిషన్‌నాయక్, శ్రీహరి, చీన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యాపేటలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశం

పెద్దవూర : లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నేడు (సోమవారం) సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ సక్రునాయక్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమల అమలుపై, గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. జిల్లా కేంద్రాల్లో ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని, పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని, ఇల్లులేని నిరుపేదలకు బేషరతుగా ఇల్లు మంజూరు చేయాలని, గిరిజనులకు అన్ని సబ్సిడీలను విడుదల చేయాలని, విద్యా, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'చలో హైదరాబాద్' కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ వర్గీకరణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవను తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి-తెలంగాణ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమం కరపత్రాన్ని ఆ సంఘం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామాంజీ సైదులు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కేంద్రంపై తెలంగాణ సీఎం ఒత్తిడి తీసుకురావాలని, అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, మాదిగల జనాభా ప్రకారం వచ్చే అసెంబ్లీ పార్లమెంటు స్థానాలలో సీట్ల కేటాయింపు చేయాలని, దళితులకు గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3లక్షల సాయాన్ని రూ. 10లక్షలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి నూకపంగ కాశయ్య, జిల్లా నాయకులు ఇంద్రపల్లి శ్రీనివాస్, కొండేటి చంద్రయ్య, మీసాల సైదులు, లక్ష్మణ్, మధు, సైదులు తదితరులున్నారు.

రోడ్డుపైనే సరుకు దిగుమతులు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


రోడ్డుకు అడ్డంగా నిలిపిన బస్సు

నిడమనూరు : ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సును రోడ్డుపై అడ్డంగా నిలిపి సరుకు ఎగుమతి, దిగుమతి చేస్తున్నారు. మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన కొరియర్ బస్సును మండల కేంద్రంలోని కార్యాలయం వద్ద రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్నారు. కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి కావడం, మండల కేంద్రంలో రద్దీ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా వాహనాన్ని నిలపడం వల్ల రహదారిపై రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నది. కొన్నాళ్లుగా ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారని, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రోడ్డుకు అడ్డం పెట్టకుండా చూడాలని వారు కోరుతున్నారు.

'బీసీ బలగం' కరపత్రం ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని హౌసిగ్‌బోర్డులో ఆదివారం బీసీ బలగం తెలంగాణ రాష్ట్ర కరపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ జటంగి వెంకటనర్సయ్య యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీసీలకు పార్లమెంటు, అసెంబ్లీలలో 50శాతం వరకు సీట్లు కేటాయించాలని, ఇది అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించాలన్నారు. తెలంగాణాలో దళిత బంధు మాదిరగానే బీసీ బంధును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీ స్థలం ఉన్న బీసీలకు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల వరకు ఇవ్వాలన్నారు. సబ్సిడీ గొర్రెల పథకం వాటాధనం లేకుండా రూ.2లక్షల వరకు ఇవ్వాలన్నారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సంఘం చైర్మన్ కోట శ్రీనివాస్‌రావు, నాయకులు మురళియాదవ్, నోముల జనార్దన్, మాచర్ల శ్రీనివాస్, పావురాల సైదులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కిటకిటలాడిన పశువుల సంత

కొండమల్లేపల్లి : జిల్లాలోనే అతిపెద్ద సంతగా పేరొందిన కొండమల్లేపల్లి సంత ఆదివారం క్రయ విక్రయాలతో కిటకిటలాడింది. బక్రీద్ పండుగకు చివరి ఆదివారం కావడంతో ఆదివారం సంతలో గొర్రె పొటేళ్ల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి క్రయ, విక్రయదారులు తరలిరావడంతో సంత రద్దీగా మారింది.


గొర్రె పొటేళ్ల విక్రయాలతో కిటకిటలాడుతున్న సంత

ఇంటింటికీ బీజేపీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న పులకరం భిక్షం

కనగల్: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఏర్పడి 9సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మహాజన అభియాన్ పేరుతో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కనగల్ మండలంలోని పానుగోడు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు గొప్పవి

మిర్యాలగూడ : లయన్స్‌క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ పేద ప్రజలకు అందిస్తున్న సేవలు గొప్పవని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైష్ణవిగ్రాండ్ హోటల్ నిర్వహించిన లయన్స్‌క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు సైతం సేవలు అందించాలని సూచించారు. కంటి ఆస్పత్రి ద్వారా పేదలకు చూపును అందించడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సైతం లయన్స్‌క్లబ్ సేవలు అందించాలని ఆయన కోరారు. లయన్స్‌క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో జగిని బీమయ్య, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రఘుపతి, సత్యనారాయణరెడ్డి, భాగ్యలక్ష్మీ, మధు, రవీందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

గురుకుల పాఠశాలకు సొంత భవనం ఏర్పాటు

చండూరు: మహాత్మా జ్యోతిరావ్ పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చండూరు మండలంలోని దోనిపాముల గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించి మాట్లాడారు. అధికారులు స్థల నిర్ధారణ చేయాలని సూచించారు. తెలంగాణలో ప్రతి విద్యార్థి కార్పొరేట్ విద్య చదువుకోవాలనే గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు సైతం అమలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్ తిరందాసు నర్మద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, దాసరి స్వామి, పాండు, దశరథ, చంద్రయ్య, వెంకన్న, సైదులు, శంకర్, నర్సింహ, యాదగిరి ఉన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల

బాధిత కుటుంబానికి పరామర్శ


నిడమనూరు : మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న గుత్తా, భాస్కర్ రావు


తిరుమలగిరి : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన తెనాలి సైదిరెడ్డి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బోయగూడెం గ్రామంలో సైదిరెడ్డి దశ దిన కర్మ నిర్వహించగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరయ్యారు. సైదిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెమలి సునీత కృష్ణారెడ్డి, నాయకులు తెనాలి సాయిరాంరెడ్డి, నెమలి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

నిడమనూరు : మండలంలోని మారుపాక మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకుడు మేరెడ్డి సురేందర్‌రెడ్డిని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే ఎన్ భాస్కర్‌రావులు ఆదివారం పరామర్శించారు. సురేందర్‌రెడ్డి ఇటీవల ఇంట్లో జారి పడడంతో చేతి విరిగింది. ఈ విషయం తెలుసుకున్న వారు నల్లగొండలోని సూర్యవంశీ కాలనీలోని సురేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కనగల్: మండల పరిధిలోని కురంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ఆదివారం రూ.25వేల విరాళం అందజేశారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. సర్పంచ్ తలారి కరుణశ్రీరవీందర్, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో పోలె వెంకటాద్రి, పోలోజు వెంకటాచారి, ఎస్‌కే లతీఫ్, ముక్కమల వెంకన్న,, కర్నాటి మల్లేష్, గాషిరాం, శంకర్‌రెడ్డి, ఈశ్వర్, నాగర్జున, పెరిక లింగయ్య, యాదయ్య, వెంకటేశం, నరసింహ, పెద్ద లింగయ్య, మహేష్, జిల్లా మనిబాబు పాల్గొన్నారు.


చాడ కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్న ఆస్పత్రి వైద్యులు, నిర్వాహకులు


రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ వీరబాబు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన తండ్రి సలీం జ్ఞాపకార్థంగా కుమారుడు సాధిక్ నిర్వహణలో మాట్రిక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను వైద్యులు పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎండీ.యూసూఫ్, ఎంపీటీసీ కామెపల్లి అనంత లక్ష్మీలు మాట్లాడుతూ సాధిక్ గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు శ్రీను, అన్నెబోయిన సైదయ్య, జహంగీర్, దస్తగిరి, యాదగిరి, లాల్‌అహ్మద్, సుదర్శన్, రఫీ, జాని, ఇబ్రహీం పాల్గొన్నారు.

డిండిలో..

డిండి : హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గోనకొల్ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 300మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల శైలేష్, వైద్యులు వీరరాజు, ఉపేందర్, ట్రస్ట్ సభ్యులు నారాయణ, ప్రకాష్, సత్యనారాయణ, సురేందర్, కృష్ణ, దివ్య పాల్గొన్నారు.